క్లుప్తంగా

పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



జనగామలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో

కోటపల్లి: గ్రామపంచాయతీ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీపీవో వెంకటేశ్వర్లు కార్యదర్శులను హెచ్చరించారు. జనగామ, ఆలుగామ, రోయ్యలపల్లి, పుల్లగామ, సిర్సా గ్రామపంచాయతీలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పుల్లగామ, సిర్సా గ్రామకార్యదర్శులు అందుబాటులో లేకపోవడంతో కార్యదర్శులపై చర్యలకు ఎంపీవో అక్తర్‌ను ఆదేశించారు. జనగామ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి పనుల్లో నిర్లక్ష్యం వహించడమే కాకుండా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టడంలేదని, డంపింగ్‌యార్డులో బీడీ ఆకుల కల్లం నిర్వహణ చేస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదని డీపీవో కార్యదర్శిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం, ఇతర జిల్లాలో ఉంటూ నెలలో ఒక్కసారి వస్తున్నారని ఇటీవల డీపీవోకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారని, అందులో భాగంగానే డీపీవో ఆకస్మికంగా తనిఖీ చేశారని సమాచారం. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేసి రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో కార్యదర్శిని మందలించారు. ఆయన వెంట కార్యదర్శులు, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

చదువుతోపాటు విలువలు నేర్పించాలి

మంచిర్యాలఅర్బన్: పాఠశాలల్లో చదువుతోపాటు మానవతా విలువలు నేర్పించాలని సెక్టోరల్ అధికారి చౌదరి అన్నారు. మంగళవారం మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో హ్యూమన్ ట్రాఫికింగ్ ఫర్ స్కూల్ అసిస్టెంట్‌పై కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్, టీఎస్ఆర్ఐఎస్ ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. పలు అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో శిక్షణ కోర్స్ కో–ఆర్డినేటర్ యశోధర, క్వాలిటీ కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, సంస్థ ప్రతినిధులు సిరాజ్, అనిల్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు అడ్డగింత

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని పాత బస్టాండ్ మూలమలుపు వద్ద బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీని తొలగించడానికి మంగళవారం మున్సిపల్ అధికారులు టీపీవో తిరుపతమ్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, సిబ్బంది ప్రయత్నించగా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. ఈ వ్యవహారంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అధికార పార్టీ ఫ్లెక్సీలను కూడా తొలగించాలని నాయకులు పట్టుబట్టారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ ఆఫీస్‌కు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం ఇవ్వడానికి ప్రయత్నించగా ఆఫీస్‌లో సిబ్బంది లేకపోవడంతో గుమ్మానికి వినతిపత్రం అంటించి వెళ్లారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, సూరి బాబు, అబ్బాస్, సదానందం, రాజశేఖర్, శంకర్, రాజ్‌కుమార్, రమేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నీటి సంరక్షణకు జల్ సంచాయ్-జన్ భగీదారి

మంచిర్యాలఅగ్రికల్చర్: జల సంరక్షణ కార్యక్రమాన్ని జాతీయ ప్రాధాన్యతగా మార్చాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జల్ సంచాయ్–జన్ భగీదారి కార్యక్రమం ద్వారా కృషి చేస్తోందని క్రేంద జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అన్నారు. మంగళవారం న్యూఢిల్లీ నుంచి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షపు నీటిని పొదుపు చేసే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నంనూర్ పునరావాస కాలనీలో శ్రీఅభయాంజనేయ, భక్తాంజనేయ, శివపంచాయతన, నాగేంద్ర, నవగ్రహ, ధ్వజ శిఖర ప్రతిష్ఠాపనా మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, హోమాలు నిర్వహించారు. విగ్రహాలను ఆలయానికి తీసుకొచ్చి పూజలు చేశారు. అచ్చులాపూర్ వేద పండితులు దుద్దిళ్ల ధీరజ్ అవధాని, ఆలయ నిర్మాణ ప్రధాన దాత ఆన్కార్ పద్మశ్రీ–సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దండేపల్లి: బోరు పక్కన నిలిచిన మురుగు



చెన్నూర్ అంబేడ్కర్ కాలనీలో కుంటను తలపిస్తున్న మురుగు నీరు



భీమారం: ఎస్సీకాలనీలో రోడ్డెక్కిన మురుగునీరు



పుల్లగామలో ఇళ్ల మధ్యే నిలిచిన మురుగునీరు



హవ్వా ఇదేం కంపు..!

భీమారం/దండేపల్లి/కోటపల్లి/చెన్నూర్: పారిశుధ్యం లోపించింది. ఇళ్లలోని మురుగు నీరు సమీప ఖాళీ స్థలాల్లో, రోడ్డుపై పారుతుండడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకముందే అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. చెన్నూర్ మున్సిపాలిటీలోని 4వ వార్డు పరిధిలో గల అంబేద్కర్ కాలనీలో డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు నీరు ఒక్కచోట చేరి కుంటను తలపిస్తోంది. కాలనీ మొత్తం కంపు కొడుతోంది. కోటపల్లి మండలం పుల్లగామలో ఇళ్ల మధ్యలో మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. భీమారం మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. డ్రెయినేజీలోని వ్యర్థాలు తొలగించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దండేపల్లి మండలంలోని ముత్యంపేట బస్టాప్ సమీపంలో స్వీట్‌హౌస్ దగ్గర గల చేతిపంపు పక్కన మురుగు నీరు నిలిచింది. అపరిశుభ్రంగా ఉండటంతో పాటు దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకొని మురుగు నీరు నిలువకుండా చూడాలని, డ్రెయినేజీల్లో వ్యర్థాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఊరూరా భూ భారతి సదస్సులు

- భూ సమస్యల పరిష్కారానికి రైతుల నుంచి అర్జీలు స్వీకరణ
- హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

భూ భారతి రెవెన్యూ సదస్సులతో గ్రామాల్లో నెలకొన్న రైతుల భూ సమస్యలు సత్వరంగా పరిష్కారం అవుతాయని అధికారులు పేర్కొన్నారు. ఊరూరా భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు.



బెల్లంపల్లిరూరల్: అంకుశంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణ

బెల్లంపల్లిరూరల్: మండలంలోని అంకుశం గ్రామంలో మంగళవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించగా తహసీల్దార్ కృష్ణ హాజరయ్యారు. అంకుశం గ్రామంలో 18 దరఖాస్తులు, బట్వాన్‌పల్లిలో 26దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హమీద్ , ఆర్ఐలు మురళీధర్ రావ్, రమేష్, మాజీ సర్పంచ్ రాజమొగిలి, మాజీ ఉప సర్పంచ్ భానుచందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేటలో 5, ఆస్నాదలో 42 దరఖాస్తులు వచ్చినట్లు చెన్నూర్ తహసీల్దార్ మల్లికార్జున్ తెలిపారు.

కోటపల్లి: మండలంలోని రాపన్‌పల్లిలో 14, శెట్‌పల్లి10 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ రాఘవేంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో డీటీ నవీన్‌కుమార్, ఆర్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నెన్నెల: మండలంలోని ఆవుడం, పొట్యాల గ్రామాల్లో తహసీల్దార్ మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆవుడంలో 115, పొట్యాలలో 33 భూ సమస్యల అర్జీలు వచ్చినట్లు తెలిపారు. డీటీ ప్రకాష్, ఆర్ఐ సులోచన, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వేమనపల్లి: మండలంలోని మామడలో 7, జక్కపల్లిలో 3 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌ఆలీ, డీటీ సాయికృష్ణ పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని తానిమడుగు, బిక్కనగూడ గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తానిమడుగులో 9, బిక్కనగూడలో 3 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే తెలిపారు. డీటీ విజయ, ఆర్ఐ బొద్దుల భూమన్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భీమిని: మండలంలోని చిన్నతిమ్మపూర్‌లో 7, అక్కలపల్లిలో 18దరఖాస్తులు రాగా కన్నెపల్లి మండలంలోని కన్నెపల్లిలో 4, సుర్జపూర్‌లో 70, బాబాపూర్‌లో 38దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. తహసీల్దార్లు బికర్ణదాస్, శ్రవణ్‌కుమార్, నాయబ్ తహసీల్దార్లు గోవర్ధన్, పోచయ్య, వ్యవసాయ విస్తీర్ణాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లిలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

నస్పూర్: పట్టణ పరిధిలోని తీగల్‌పహడ్, తాళ్లపల్లిలో రెవెన్యు సదస్సులు నిర్వహించగా తహసీల్దార్ సంతోష్‌కుమార్ హాజరయ్యారు. రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మండలంలోని ఎల్లారం, లింగాపూర్‌లో సదస్సులు నిర్వహించారు. ఎల్లారం 43, లింగాపూర్‌లో 3 దరఖాస్తులు వచ్చాయి. ఆర్డీవో శ్రీనివాస్ రావు, తహసీల్దార్ దిలీప్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: పాతమంచిర్యాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ రఫతుల్లా హుస్సేన్ ఆధ్వర్యంలో, గర్మిళ్లలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్ ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించారు. పాతమంచిర్యాలలో 19దరఖాస్తులు, గర్మిళ్లలో 42 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.



తానిమడుగులో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్



బావురావుపేటలో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్



పొట్యాలలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

శరీర ఆరోగ్యానికి యోగా అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యురాలు, యోగాసభ్యులు

మందమర్రిరూరల్: శరీర ఆరోగ్యానికి యోగా ఎంతగానో అవసరమని ఆయుష్ విభాగం వైద్యురాలు నీరజ, యోగా శిక్షకులు రామ్మోహన్, కొంపెల్లి రమేశ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. యోగాపై అవగాహన కల్పించారు. పెట్రోల్ బంకు నుంచి పాత బస్టాండ్ మీదుగా ప్రభుత్వ ఆసుపత్రి వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.

నెన్నెల: అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో యోగా వాక్ కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువులు కాచం ప్రదీప్–మమత ర్యాలీ నిర్వహించి యోగాసనాల ప్రాముఖ్యతను వివరించారు. నిత్యం జీవితంలో ప్రతి ఒక్కరూ యోగా చేసి ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో యోగా విద్యార్థులు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భీమిని: అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం కన్నెపల్లిలో 'యోగా నడక' చేపట్టారు. యోగా శిక్షకులు ఎస్.రజిత, జి.చొక్కయ్యలు విద్యార్థులతో కలిసి ర్యాలీ తీశారు.

టెన్త్ టాపర్‌కు నగదు పురస్కారం

తాండూర్: మండల కేంద్రంలోని మహాత్మజ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివిన సీహెచ్. హర్షవర్ధన్ 600మార్కులకు గాను 583మార్కులతో టాపర్‌గా నిలిచాడు. ఆ గురుకుల పాఠశాల వందశాతం ఉత్తీర్ణతను సాధించి ప్రత్యేకతను చాటుకుంది. కాగా హైదరాబాద్ వేదికగా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పదో తరగతి టాపర్ హర్షవర్ధన్‌ను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.10వేలు ప్రోత్సాహక బహుమతిని అందజేసి, గురుకుల ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్‌కు మెమొంటో అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఉద్యోగులు భద్రత నిబంధనలు పాటించాలి

మందమర్రిరూరల్: ఏరియాలోని కేకే ఓసీ ఆవరణలో మంగళవారం భద్రతా నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి రీజనల్ సేఫ్టీ జీఎం రఘుకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతీ ఉద్యోగి విధి నిర్వహణలో భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రమాదాలపపై అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత బాధ్యతలు గుర్తుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఓసీ మేనేజర్ రామరాజు, ప్రాజెక్ట్ ఇంజనీర్ వెంకటవంశీధర్ ఉన్నారు.

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిగా దుర్గాప్రసాద్

మంచిర్యాలటౌన్: జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిగా షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ ఈడీ చాతరాజుల దుర్గాప్రసాద్ పూర్తి అదనపు బాధ్యతలను మంగళవారం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కుమార్‌దీపక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులుగా పనిచేసిన పోటు రవీందర్ రెడ్డి గత నెలలో పదవీ విరమణ పొందగా, ఆయన స్థానంలో దుర్గాప్రసాద్ అదనపు బాధ్యతలు స్వీకరించారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న దుర్గాప్రసాద్

లారీల యజమానుల రిలే నిరాహార దీక్షలు

నస్పూర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కోల్‌బెల్ట్ ఏరియా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లారీల యజమానులు స్థానిక గోదాముల వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సీసీఐ అధికారులు ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ కిరాయిలకు లారీలను తెప్పించి, లోడింగ్ చేస్తూ తమ పొట్టకొడుతున్నారని ఆరోపించారు. తమ కుటుంబాలు లారీల మీదే ఆధారపడి జీవిస్తున్నాయని, తమను రోడ్డున పడేయొద్దని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ గుండా సురేష్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్ బాస్కర్ల సుమన్, జనరల్ సెక్రటరీ రమేశ్, నాయకులు తిరుపతి, పవన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న నాయకులు, లారీల యజమానులు

సంక్షిప్త వార్తలు

జన్నారం ఎస్సైగా అనూష

జన్నారం: జన్నారం ఎస్సైగా అనూషను నియమిస్తూ రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన రాజవర్ధన్ రామగుండం వీఆర్ కు బదిలీ చేశారు. జన్నారం మండలానికి మహిళా ఎస్సై రావడం ఇదే మొదటిసారి.

'రాజిరెడ్డిని విమర్శిస్తే సహించేదిలేదు'

చెన్నూర్: 30ఏళ్ల నుంచి స్వర్గీయ మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి (కాకా) కుటుంబంతో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డికి ఉన్న అనుబంధంతో ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ఇన్‌చార్జిగా వ్యవహరించి వారి గెలుపునకు కృషి చేసిన విషయం ఈ ప్రాంత ప్రజలందరికీ తెలుసని కౌన్సిలర్ పోగుల సతీశ్ అన్నారు. చెన్నూర్, కోటపల్లి, భీమారం మండలాల కాంగ్రెస్ నాయకలతో కలిసి మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ స్థాయిని మరిచి రాజిరెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో చెన్నూర్, కోటపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు మంతెన సమ్మయ్య, ఠాగూర్ స్వరూప్‌సింగ్, స్వామి, ముత్యాల రవికుమార్, నిజాం అలీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ టీచర్లు ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టొద్దు'

బెల్లంపల్లి: ప్రభుత్వ ఉపాధ్యాయులు కొందరు ఆటోడ్రైవర్ల పొట్టకొట్టే చర్యలకు పాల్పడొద్దని జిల్లా ఆటో జేఏసీ అధ్యక్షుడు కె.రాంమ్మోహన్ అన్నారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత కారు కలిగి ఉన్న టీచర్లు కొందరు, ఆటోలలో పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయులను రవాణా చేస్తూ తమకు గిరాకీ లేకుండా చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే మహాలక్ష్మి పథకం వల్ల ఆటో డ్రైవర్లు నానా తంటాలు పడుతున్నారని, తమ జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా చూడాలని అన్నారు.

ఐఎన్‌టీయూసీ నాయకుల పర్యటన

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే1ఏ, ఐకే-ఓసీపీపై ఐఎన్‌టీయూసీ నాయకులు మంగళవారం పర్యటించారు. యూనియన్ సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్‌రావు నేతృత్వంలో బ్రాంచ్ నాయకులు గనిలో కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గనిలో టాయిలెట్లు, స్నానాల గదులు లేవని, అదనంగా మ్యాన్‌పవర్ గురించి పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారన్నారు. యాజమాన్యం దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

జన్నారం/మందమర్రిరూరల్: జన్నారం, మందమర్రి ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో అడ్మిషన్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మందమర్రి ఐటీఐ ప్రిన్సిపాల్ దేవానంద్, జన్నారం ఐటీఐ ప్రిన్సిపాల్ రాములు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ

నెన్నెల: మండలంలోని 14గ్రామపంచాయతీలకు చెందిన 169మందికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన పత్రాలను నెన్నెల రైతువేదికలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు రైతులకు అందజేశారు.

నాణ్యమైన విత్తనాలతో రైతులకు మేలు

- అన్నదాతలకు అధికారుల సూచనలు



జన్నారం: విత్తనాలు అందజేస్తున్న నోడల్ అధికారి ప్రవీణ్‌కుమార్

కోటపల్లి/జన్నారం/బెల్లంపల్లిరూరల్/కాసిపేట/వేమనపల్లి/తాండూర్/జైపూర్: నాణ్యమైన విత్తనాలతో రైతులకు మెరుగైన దిగుబడి పొంది ఆర్థికంగా ఎంతో మేలు చేకూరుతుందని అధికారులు తెలిపారు. పంటల సాగులో నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతులకు వరి, పెసర విత్తనాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. రైతులు విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో సాగు చేసి విత్తనోత్పత్తి చేసి ఇతర రైతులకు అందజేసేలా అవగాహన కల్పించారు. వరి, పెసర మెలకువలపై సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో తాండూర్ మండల వ్యవసాయాధికారి సుష్మ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ సాలిగాం బానయ్య, జన్నారంలో నోడల్ అధికారి ప్రవీణ్‌కుమార్, ఏవో సంగీత, కోటపల్లిలో శాస్త్రవేత్త డాక్టర్ స్రవంతి, ఏవో సాయికృష్ణ, బెల్లంపల్లిలో ఏడీఏ రాజానరేందర్, వ్యవసాయ విశ్వవిద్యాలయం (పొలాస) ప్రొఫెసర్ రత్నాకర్, చంద్రవెల్లి పీఏసీఎస్ చైర్మన్ స్వామి, మండల వ్యవసాయశాఖ అధికారి ప్రేమ్ కుమార్, వేమనపల్లిలో వ్యవసాయ శాస్త్రవేత్త నాగరాజు, ఎంపీఓ వీరన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌ఆలీ, మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, కాసిపేటలో జిల్లా నోడల్ అధికారి శ్రీకాంత్, మండల వ్యవసాయాధికారి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, జైపూర్, భీమారం మండలాల్లో బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ప్రియాసుగంధి, వ్యవసాయశాఖ అధికారులు మార్క్‌గ్లాస్టన్, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.



నీల్వాయిలో విత్తనాలు అందజేస్తున్న అధికారులు



బెల్లంపల్లిరూరల్: రైతులకు విత్తనాలు అందజేస్తూ..



తాండూర్: విత్తనాలు అందజేస్తున్న అధికారులు

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

బెల్లంపల్లి: ఘట్‌కేసర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. 8మంది అత్యుత్తమంగా రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.రామారావు, జిల్లపల్లి వెంకట స్వామి ప్రకటించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో 8 గోల్డ్ మెడల్స్, 14సిల్వర్ మెడల్స్, 18 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. త్వరలో ఉత్తరఖండ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులు హాజరు కానున్నట్లు తెలిపారు.